క్లుప్తంగా

వేసవి విజ్ఞాన కేంద్రాలతో ఎంతో ఉపయోగం



గడివేముల గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గడివేముల: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన కేంద్రాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఉపాధ్యాయుడు మహబూబ్ బాషా, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన గడివేములలోని గ్రంథాలయంలో 39 రోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు మంజూరు



హెచ్ఎంలకు పుస్తకాల కిట్లను అందజేస్తున్న ఎంఈఓ

కోడుమూరు రూరల్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివే 8940 మంది విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరానికి గాను పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో కూడిన కిట్లు మంజూరైనట్లు ఎంఈఓ తైమూర్‌బాషా గురువారం తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే 12వ తేదీ విద్యార్థులకు కిట్లను అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు పుస్తకాల కిట్లను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు



వధూవరులతో కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్

సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప్పరి మల్లికల్, కురువ భీముడు కుమారుల వివాహాలకు గురువారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, పార్టీ నాయకులు మండల నాయకులతో కలిసి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు, మండల కోఆప్షన్ సభ్యుడు ముల్లా హారున్‌రోషిద్, నాయకులు బాయికాటి మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, ఎస్ఎంబాషా, సర్పంచ్ పాండురంగన్న, తెలుగు దస్తగిరి, ఉప్పర శంకర్ తదితరులు ఉన్నారు.

పక్కా కొలతలతో ఆస్తి పన్ను మదింపు



చలపతి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఆస్తిపన్ను సర్వేను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

కర్నూలు (టౌన్) : ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మాణాలకు అనుగుణంగా ఆస్తి పన్ను మదింపునకు ఇంటింటి సర్వే చేపట్టి పక్కా కొలతలు తీస్తున్నట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ. కృష్ణ అన్నారు. గురువారం పాతబస్టాండ్‌లోని చలపతి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఆస్తి పన్ను మదింపు సర్వే పరిశీలించారు. అనంతరం ఆయన నగరంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

10 గంటల పని విధానాన్ని వెనక్కు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏపీ క్యాబినెట్ తీసుకున్న 8 గంటల పని స్థానంలో 10 గంటల విధానాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. రాత్రి వేళల్లో మహిళలు డ్యూటీ చేయాలని తీసుకోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. గురువారం సుందరయ్యసర్కిల్‌లో పది గంటల పని విధానాన్ని నిరసిస్తూ సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు అధ్యక్షతన ఆందోళన నిర్వహించారు. సీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ..తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించడం కోసం 8 గంటల పని స్థానంలో 10 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సాయిబాబా, సుధారప్ప, రాముడు, ప్రభాకర్, గురుశేఖర్, నగేష్‌పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పాణ్యంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



మొక్కలు నాటుతున్న అధికారులు

ఓర్వకల్లు: వాతావరణ మార్పుల కారణంగా హరించిపోతున్న పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఓర్వకల్లు సమీపంలోని ప్రకృతి సిద్ధంగా వెలసిన రాక్‌గార్డెన్ ఆవరణలో యూనిట్ మేనేజర్ జీవన్‌జాయ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక చెట్టు నాటితే, అది ఎన్నో జీవితాలకు ఆధారంగా నిలుస్తుందన్నారు. ప్రకృతి పట్ల సందర్శకులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రిసార్ట్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటి, స్వచ్ఛతపై ప్రమాణం చేయించారు. రిసార్ట్‌లో పలు చోట్ల పర్యావరణ పరిరక్షణపై పలు సందేశాత్మకమైన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ సిబ్బంది నాగరాజు, దీప్తిరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను సంరక్షించుకోవాలి

కోడుమూరు రూరల్: చెట్లను విచ్చలవిడిగా నరికేయకుండా సంరక్షించుకోవాలని కోడుమూరు ఎంపీడీఓ రాముడు ప్రజలకు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో అధికారులు గురువారం మొక్కలు నాటారు. వర్కూరు, ప్యాలకుర్తి గ్రామాల్లో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఏపీఓ మోదీన్‌బాషా, హౌసింగ్ ఏఈ సుమంత్ గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యమైనవన్నారు. చెట్ల నరికివేత వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోందని, దీనివల్ల భూమిపై జీవుల మనుగడకు ముప్పు వాటిల్లుతోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచాలని తెలిపారు. మండలంలో 3 వేల మొక్కలు నాటినట్లు ఏపీఎం తెలిపారు.

ప్రతి ఒక్కరు మొక్కలను సంరక్షించాలి

పాణ్యం: ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం పర్యావరణం దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా భారీ వృక్షాలు తరిగిపోతున్నాయన్నారు. వాటి స్థానంలో అందరు కలిసి మొక్కలు నాటాలన్నారు. అకాల వర్షాలు, భూకంపాలు తదితర ప్రకృతి విపత్తులు వస్తున్నాయంటే అందుకు పర్యావరణ అసమతుల్యతే కారణమన్నారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలు, మైదానాలు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాణ్యం సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దస్వామి, ఖాదర్, సుబ్బయ్య, మార్కెట్‌యార్డు సభ్యులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

- ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.
- అలాగే శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పర్యావరణం దినోత్సవాని ఘనంగా జరిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

గడివేముల: మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ, తహసీల్దార్, సచివాలయం కార్యాలయా వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం సమతుల్యానికి, కాలుష్య నివారణ కోసం మొక్కలు నాటితే ఎంతో మేలు కలుగుతుందన్నారు. చెట్లను నాటడం ద్వారా మానవాళికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. చెట్లు లేకపోవడంతో అక్సిజన్ తగ్గిపోయి కార్బన్డయాక్సైడ్ ఎక్కువ అవుతుందన్నారు. మొక్కలును పరిరక్షిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సచివాలయాల పరిధిలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. స్థానిక జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో బీసీ హాస్టల్‌లో మొక్కలు నాటారు.తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, ఈఓపీఆర్‌డీ మహీధర్‌రెడ్డి, ఏపీఓ వెంకటరమణ, ఉప సర్పంచ్ బాలచెన్ని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచండి

ఓర్వకల్లు: మానవ మనుగడకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే గౌరు చరిత పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గుట్టపాడు సమీపంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీయల్ పార్కులో ఏర్పాటు చేస్తున్న ×ప్రైమో పాలి ప్యాక్×కు భూమి పూజ చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పూడిచెర్ల గ్రామానికి చెందిన రైతు రాజన్న పొలంలో తవ్విన ఫారంపాండ్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ మద్దీశ్వరమ్మ, సాంకేతిక సహాయకులు, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, స్థానిక నాయకులు రాజన్న, శివుడు, పుల్లారెడ్డి, గోకారి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

సి.బెళగల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. మొక్కల ఆవశ్యకతపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, ఉపాధిహామీ ఏపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, పాఠశాల చైర్మన్ గోవిందు, పాల్గొన్నారు.



రిసార్ట్‌లో మొక్కలు నాటుతున్న డీవీఎం లక్ష్మీనారాయణ



ఆర్‌జీఎం కళాశాలలో మొక్కలు నాటుతున్న డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్



గడివేముల సచివాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ,అధికారులు



ప్యాలకుర్తిలో మొక్కలు నాటుతున్న మండల అధికారులు

కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు



ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల

పాణ్యం: రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో పాణ్యం పరిధిలో నెరవాడ మెట్ట వద్ద ఉన్న పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ-2 సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 203 మంది విద్యార్థులు, మధ్యాహ్నం 200మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 203 మంది, మధ్యాహ్నం 200 మంది విద్యార్థులు పరీక్షల రాయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రాల్లోకి వచ్చేటప్పుడు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం పరీక్ష సమయం 9.30 నుంచి 12 గంటలకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు.

ఓసీటీ విధానంలో మూడు వాల్వ్‌లకు స్టెంట్లు

- 68 ఏళ్ల వృద్ధునికి కర్నూలులో అరుదైన చికిత్స



ఓసీటీ మిషన్‌తో డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ అనిరుధ్‌కుమార్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫి(ఓసీటీ) విధానంలో పరీక్షించి గుండెలో బ్లాక్ అయిన మూడు వాల్వ్‌లకు మొదటిసారి స్టెంట్లు వేసినట్లు శ్రీ విజయదుర్గ కార్డియాక్ సెంటర్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. గురువారం ఆయన విజయదుర్గ కార్డియాక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.అనిరుధ్ కుమార్‌తో కలిసి నూతన విధానం గురించి మాట్లాడారు. సాధారణంగా గుండె పోటు వచ్చిన వారికి, గుండె సమస్యలున్న వారికి యాంజియోగ్రామ్ ద్వారా గుండె రక్తనాళాల పనితీరును పరీక్షిస్తామన్నారు. కానీ కర్నూలులోనే మొట్టమొదటిసారిగా (ఓసీటీ) ఇమేజింగ్ అనే విధానంలో ఎండోస్కోపీ మాదిరిగా రక్తనాళాల్లోకి ట్యూబ్‌ను పంపి స్కాన్ చేస్తామన్నారు. ఈ విధానంలో ఎక్కడ బ్లాక్ ఉంది, ఎంత మేరకు బ్లాక్ ఉంది, ఎంత పొడవు, ఎంత వెడల్పు స్టెంట్ వేయాలి లేదా ఆపరేషన్ చేయాలా అన్న విషయాలను ఈ ఓసీటీ మిషన్ నిర్ధారిస్తుందన్నారు. దీంతో చికిత్సను వంద శాతం విజయవంతం చేయవచ్చన్నారు. ఇలాంటి చికిత్సను కర్నూలుకు చెందిన 68 ఏళ్ల వృద్ధునికి గతనెల 29వ తేదీన నిర్వహించినట్లు తెలిపారు. సదరు వ్యక్తికి 26వ తేదీన హార్ట్ ఎటాక్ వచ్చిందని, పరీక్షించగా మూడు వాల్వ్‌లు బ్లాక్ అయినట్లు గుర్తించామన్నారు. కుటుంబసభ్యులు ఆపరేషన్ వద్దని చెప్పడంతో ఓసీటీ విధానంలో అతని రక్తనాళాలను పరీక్షించామన్నారు. మూడు వాల్వ్‌లు స్టెంట్ వేసేందుకు అనుకూలంగా ఉండటంతో స్టెంట్లు వేశామన్నారు. ఇలాంటి ఆధునిక చికిత్సలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాల్లో మాత్రమే నిర్వహిస్తారని, ఇప్పుడు కర్నూలులో కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలపై దృష్టి సారించాలి

కర్నూలు(సెంట్రల్): పదే పదే రోడ్డుప్రమాదలు జరిగే ప్రదేశాలపై దృష్టి సారించి నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కలెక్టర్ జిల్లా రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రమాదాలకు కారణాలను విశ్లేషించాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డిని ఆదేశించారు. కర్నూలు శివారులోని ఎల్లమ్మ గుడి దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలతో షెడ్‌ను నిర్మించేందుకు ముందుకు వచ్చిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఎందుకు స్థలం కేటాయించడం లేదని జీజీహెచ్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి స్థలాన్ని కేటాయించి పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...మరి కొద్ది రోజుల్లోనే పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బస్సులు, వ్యాన్ల ఫిట్‌నెస్‌ను పరీక్షించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణపై చాలా వీడియోలు చేశామని, వాటిని నగరంలోని ముఖ్య కూడళ్లలో ప్రదర్శించేందుకు మొబైల్ వాహనం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో పీఆర్ ఈఈ మద్దన్న, ఆర్‌డీఓ భరత్‌నాయక్ పాల్గొన్నారు.

మసకబారిన డీసీసీబీ ప్రతిష్ట

- ఇంటి దొంగలతో బజారున పడుతున్న పరువు
- 2024–25లో రైతులకు అందించిన సేవలు నిల్
- పేరుకుపోతున్న నిరర్థక అస్తులు
- నేడు డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు గాడి తప్పింది. బ్యాంకులో ఇంటిదొంగలు ఎక్కువైపోయారు. ఎవ్వరికి వారు జేబులు ఎలా నింపుకోవాలనే దానిపైనే దృష్టి సారిస్తుండటంతో బ్యాంకు ప్రతిష్ట మసక బారుతోంది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం పాలనలో లాభాల బాట పట్టిన డీసీసీబీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రైతులకు సేవలు అందించడంలో వెనుకబడిపోయింది. బ్యాంకు ప్రతిష్టను స్వంత అధికారులు, సిబ్బందే దెబ్బతీస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆత్మకూరు బ్రాంచీలో బ్యాంకు అధికారులే రూ.కోటి వరకు కొల్లగొట్టారు. ఏడెనిమిది నెలలు అవుతున్నా..రూపాయి రికవరీ లేదు. రుణాల పంపిణీలో కమీషన్ల బెడద ఎక్కువైంది. దీర్ఘకాలిక రుణాలతో పాటు చివరికి పంట రుణాల పంపిణీలో కూడా కమీషన్ల కోసం కక్కుర్తి పడుతుండటం గమనార్హం. బ్యాంకులో ఆదాయం వచ్చే పోస్టుల కోసం పైరవీలు చేయడం ఎక్కువగా ఉంది. తమకు ఇష్టం లేని వారు పై స్థానాల్లో ఉంటే వారిపై దారుణమైన బూతులతో పిటిషన్లు పెట్టే సంస్కృతి ఎక్కువగా ఉంది. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2024–25లో లోనింగ్ పూర్తిగా పడిపోయింది. 2024 ఏప్రిల్ నెలలో డీసీసీబీ టర్నోవర్ రూ.3930 కోట్లు ఉండగా.. నేడు కూడా టర్నోవర్ అలాగే ఉంది. నిరర్థక ఆస్తులు మాత్రం భారీగా పెరిగిపోయాయి. 2024 ఏప్రిల్ నెలలో నిరర్థక ఆస్తులు రూ.195 కోట్లు ఉండగా... నేడు రూ.265 కోట్లకు పెరిగిపోయాయి.

నేడు డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ...

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్‌గా డి. విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇందుకు బ్యాంకు అధికారులు అట్టహాసంగా ఏర్పాట్లు చేశారు. ఇంతవరకు జాయింట్ కలెక్టర్ నవ్య అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి పలువురు ఆ పార్టీ నేతలు హాజరు కానున్నట్లు సమాచారం.

నేడు కంబదహాల్‌లో టీబీ పరీక్షలు

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో శుక్రవారం క్షయ వ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర అన్నారు. టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో టీబీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 60 ఏళ్లపైబడి, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలు చేస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలపాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పీసీసీ అధ్యక్షురాలు పర్యటనను విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా కోరారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని అన్ని జిల్లాల పర్యటనలో భాగంగా ఈనెల 11వ తేదీన ఆమె కర్నూలుకు వస్తున్నారన్నారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే కార్యకర్తల సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్రనాయుడు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీఎస్సీ నర్సింగ్ సెమిస్టర్ ఫీజు రూ.1800 ఉంటే రూ.2500 నుంచి రూ.3000 వరకు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే క్లినికల్ చార్జెస్ పేరుతో కూడా రూ.5 వేలనుంచి రూ.10 వేల వరకు అక్రమంగా వసూలుచేస్తున్నారని, ఈ అక్రమ ఫీజులపై ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సుందరయ్య సర్కిల్ నిర్మించాలి

కర్నూలు (టౌన్) : స్థానిక కొత్తబస్టాండ్ వద్ద సుందరయ్య సర్కిల్ నిర్మాణాన్ని చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాముడు విన్నవించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, రాజశేఖర్, రోశయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలను సీజ్ చేయాలి

కర్నూలు సిటీ: నగరంలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల వసూళ్లు చేపడుతున్నాయని, వాటిని వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. గురువారం సూర్యనారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యను వ్యాపారంగా మార్చారన్నారు. కొన్ని విద్యా సంస్థలు పాఠ్యపుస్తకాలను తమ వద్దే కొలుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. విద్యాధికారులు స్పందించి నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఆర్యన్, ఆదిత్య, పృథ్వి, హేమంత్, రుత్విక్, గ్రీష్మంత్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కర్నూలు(రూరల్): అందరూ సహకరిస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం కర్నూలు మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో సర్వసమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దిన్నెదేవరపాడు హైస్కూల్ అవరణలో ఆకతాయిలు ప్రవేశిస్తున్నారని.. ప్రహరీ నిర్మించాలని సర్పంచ్ మద్దిలేటి కోరారు. అదే విధంగా పి. రుద్రవరం గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం లేనందున గ్రామ పంచాయతీకి చెందిన పశువైద్య భవనంలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండనే స్కూల్ నిర్వహిస్తుండడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ కురువ మధు సూదన్ ఎంఈఓ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. కర్నూలు రూరల్ మండలంలోని ఉల్చాలా గ్రామంలో తాగునీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన 40 హెచ్‌పీ విద్యుత్ మోటార్ కెపాసిటీ సరిపోకపోవడంతో బావపురం నుంచి ఉల్చాల గ్రామానికి సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని సర్పంచ్ విద్యాసాగర్ అన్నారు. ఇ.తాండ్రపాడు గ్రామంలో 11 కేవీ వైర్లు ఇందిరమ్మ కాలనీ మిద్దెల మీదుగా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సర్పంచ్ బాలపీర అన్నారు. గొందిపర్ల గ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి గురుమూర్తి ఇంటి వరకు, అలగే మాజర గ్రామం అయిన దొడ్డిపాడు సుంకులమ్మ ఆలయం వీధిలో సీసీరోడ్డు, అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం రూ. రూ.8 లక్షలు ఎంపీపీ నిధులు మంజూరు చేసి నెలలు గుడుస్తున్నా అధికారులు టెక్నికల్ అనుమతులు ఇవ్వడం లేదని ఎంపీటీసీ బోయ క్రిష్ణవేణి పేర్కొన్నారు. బి.తాండ్రపాడు గ్రామంలో టీవీ9 నగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కోరారు. గార్గేయపురం ఎస్సీ కాలనీలో నీటి ట్యాంక్, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ జ్యోతిలత కోరారు. సమస్యలను వీలైనంత తర్వగా పరిష్కరించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నెహమ్మా, ఎంపీడీఓ జి.రఘునాథ్ మండల అధికారులు పాల్గొన్నారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం



వైద్యులతో సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు చెప్పారు. కోవిడ్ వైరస్‌పై గురువారం ఆయన తన చాంబర్‌లో అన్ని విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని పాత గైనిక్ విభాగంలో 20 పడకలతో కోవిడ్ వార్డు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రిలో ఒక్కో విభాగం నుంచి ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన మందులు, వైద్యపరికరాలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కోవిడ్ పరీక్షల కోసం ఓపీ నెం.99ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రస్తుత కోవిడ్ ప్రాణాంతకమైనది కాదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే ప్రతి ఒక్కరూ మాస్కులు, శానిటైజర్లు ఉపయోగించాలని సూచించారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ బి. వెంకటేశ్వర్లు, వైద్యులు ఇక్బాల్ హుసేన్, విజయానందబాబు, విశాల, సుధీర్, వేణుగోపాల్‌రెడ్డి, దమామ్ శ్రీనివాసులు, శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోతులు పోయి రాళ్లు వచ్చే !



వాహనదారులు అవస్థలు పడుకుంటూ వెళ్తున్న ఈ దారి ఎక్కడిదో కాదు. నగర నడిబొడ్డులోని కలెక్టరేట్‌లోనిదే. ఇక్కడ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు ఉంటారు. అలాంటి చోట డీఈఓ కార్యాలయానికి వెళ్లే దారి అధ్వానంగా ఉంది. వర్షం నీరు ఆగుతున్నాయనో మరెమో తెలియదు కాని గోతుల్లో సిమెంట్ పెల్లలు, కంకర వేసి వదిలేశారు. చదును చేయకపోవడంతో ఈ మార్గంలో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు